ఆణిముత్యాల తెలుగు పద్యాల సంకలనం

# వర్ణన రత్నాకరము

పాఠకమిత్ర వ్యాఖ్య – పదహారవ సంపుటం


సంకలనకర్త

**దాసరి లక్ష్మణస్వామి**

వ్యాఖ్యాతలు

**బేతవోలు రామబ్రహ్మం** **అద్దంకి శ్రీనివాస్**

**బూదాటి వేంకటేశ్వర్లు**



ప్రచురణ

ప్రాచీన తెలుగు - అధ్యయనకేంద్రం

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్

&

**ఎమెస్కో** హైదరాబాద్

# వర్ణన రత్నాకరము

## పాఠకమిత్ర వ్యాఖ్య – పదహారవ సంపుటం

## విషయసూచిక


| | అంశం | పద్యసంఖ్య | పుట | వ్యాఖ్యాత |
|---|---|---|---|---|
| | సంపాదకీయం | | 7–8 | |
| 1. | కాశికి దక్షారామమునకుఁ గల సామ్యము, తీర్థసేవ, తిరుమల యాత్ర, శ్రీశైల యాత్ర | 1–22 | 9–27 | అద్దంకి శ్రీనివాస్ |
| 2. | రామేశ్వరయాత్ర, తీర్థయాత్రాది గర్హణము, బాహ్యాభ్యంతరతీర్థములు, వీరమాహేశ్వరాచార్యవరులు | 23–39 | 28–40 | " |
| 3. | పుణ్యనదులు, గోదావరి, కావేరి, నర్మద, పినాకిని, భీమరథి, జోర్దానది, ధనుష్కోటి, పంపాసరోవరము, ఆకాశగంగ | 40–71 | 41–75 | " |
| 4. | పాతాళగంగ, గంగా ప్రభావము, గిరులు, హిమగిరి, మేరుగిరి, మందగిరి, వింధ్యగిరి, వేంకటాచలము, సింహాచలము | 72–130 | 76–132 | " |
| 5. | వీరభద్రా చలము, ఘటికాచలము, శ్రీశైలము, అహోబిలశైలము, రైవతకాచలము, కోరుకొండ,పెనుగొండ,హేమకూటము | 131–145 | 133–153 | " |
| 6. | చిత్రకూటము, ఋశ్యమూకము,నైమిశము, ఆగస్త్యాశ్రమము, దేవదారువనము, బదరీవనము | 146–163 | 154–172 | " |
| 7. | ఈశ్వర వర్ణనము, అర్ధనారీశ్వరుఁడు, శ్రీరంగశాయి, వటపత్రశాయి, శార్ఙ్గపాణి, వేంకటేశ్వరుఁడు, మాధవుఁడు | 164–203 | 173–242 | బేతవోలు రామబ్రహ్మం |
| 8. | వరదరాజస్వామి, రామేశ్వరుఁడు, భైరవుడు, భీమేశ్వరుఁడు , జగన్నాథుఁడు, రాముఁడు, బలరాముఁడు. | 204–222 | 243–268 | " |

| | అంశం | పద్యసంఖ్య | పుట | వ్యాఖ్యాత |
|---|---|---|---|---|
| 9. | మూర్ఖపద్ధతి, దుర్జన సజ్జనమైత్రి, మూర్ఖసహవాసము, సజ్జన సాంగత్యము, దుర్జన సజ్జనతారతమ్యము, ధనప్రాముఖ్యము | 223–272 | 269–306 | అద్దంకి శ్రీనివాస్ |
| 10. | పుణ్యలోకము, పుణ్యలోకభోగములు, పుణ్యకార్యములు, పాపకార్యములు, పుణ్యాత్ములు | 273–338 | 307–365 | బూదాటి వేంకటేశ్వర్లు |
| | కావ్యసూచిక | | 366–376 | |
| | పద్య సంఖ్యానుక్రమణిక | | 377–382 | |
| | దాసరి లక్ష్మణస్వామి పరిచయం | | 383–390 | |

# కాశికి దక్షారామానికి గల సామ్యము

1. సీ. **జహ్నుకన్యాతీరసన్నివేశమునకు**
**దక్షిణాంభోరాశి తటము సాటి**
**కమనీయమణికర్ణికాప్రవాహమునకు**
**సప్తగోదావరజలము సాటి**
**కటకరక్షకుఁడైన కాలభైరవునకుఁ**
**బ్రకటపాతాళభైరవుఁడు సాటి**
**విశ్వాధిపతియైన విశ్వనాయకునకు**
**భీమనాథేశ్వరస్వామి సాటి**

గీ. **మోక్షవిభవంబునకు సాటి మోక్షలక్ష్మి**
**భోగమహిమంబునకు సాటి భోగమహిమ**
**వారణాశికి శ్రీదక్షవాటమునకుఁ**
**దారతమ్యంబుఁ జర్చింప ధర్మమగునె**

*భీమేశ్వరపురాణము 4-40*

**అన్వయం :** జహ్నుకన్యా – తీర – సన్నివేశమునకున్ – దక్షిణ + అంభోరాశి – తటము – సాటి, కమనీయ – మణికర్ణికా – ప్రవాహమునకున్ – సప్తగోదావర – జలము – సాటి, కటక – రక్షకుఁడు + ఐన – కాలభైరవునకున్ – ప్రకట – పాతాళభైరవుఁడు – సాటి, విశ్వ + అధిపతి + ఐన – విశ్వనాయకునకున్ – భీమనాథ + ఈశ్వరస్వామి – సాటి, మోక్షవిభవంబునకున్ – మోక్షలక్ష్మి – సాటి, భోగమహిమంబునకున్ – భోగమహిమ – సాటి, వారణాశికిన్ – శ్రీదక్ష వాటమునకున్ – తారతమ్యంబున్ – చర్చింపన్ – ధర్మము – అగునె?

**వ్యాఖ్య :** దక్షారామానికి దక్షిణకాశి అని పేరు. అంటే కాశిలో ఉన్నవేవో దక్షిణకాశి అయిన దక్షారామంలోనూ ఉండాలి. ఉండి తీరాలి. వాటినే నిరూపిస్తున్నాడు శ్రీనాథుడు. కాశిలో గంగానది (జహ్నుకన్య) ప్రవహిస్తుంటుంది. ఆ గంగాతీర ప్రదేశానికి (తీర సన్నివేశమునకున్) సాటి అయినది దక్షిణకాశి అయిన దక్షారామంలోనూ ఉంది. అదే

దక్షిణసముద్ర (అంభోరాశి) తీరం. కాశిలో కమనీయమైన మణికర్ణిక అనే హ్రదం = మడుగు ఉంది. ఆ మణికర్ణికా తీర్థానికి సాటియైనది దక్షారామంలో ఉన్న సప్తగోదావరంలో నీరు. కాశీపట్టణానికి (కటక) రక్షకుడు కాలభైరవుడు. ఇతడికి సాటివచ్చే పాతాళభైరవుడు దక్షిణకాశిలో ఉన్నాడు. కాశిలో ఉన్న స్వామి విశ్వానికే అధిపతి అయిన కాశీ విశ్వేశ్వరుడైతే (విశ్వనాయకుఁడు) ఆ విశ్వనాయకుడికి సాటియైన వేల్పు దక్షారామంలో కొలువై ఉన్నాడు. ఆయనే భీమేశ్వరుడు (భీమనాథ + ఈశ్వరస్వామి).

ఇక కాశీలో ఉన్న మోక్షవైభవానికి దక్షిణకాశిలోని మోక్షలక్ష్మే సాటి. అక్కడ ఉన్న భోగమహిమకు ఇక్కడి భోగమహిమలే సాటి వస్తాయి. అంటే ఈ రెండు పుణ్యక్షేత్రాలూ మోక్షప్రదాలనీ, భోగమహిమాన్వితాలనీ అర్థం.

విశ్వనాయకుడే భీమేశ్వరుడు. కాళభైరవుడే పాతాళభైరవుడు. మణికర్ణికాహ్రదం వంటిదే సప్తగోదావరం. గంగానదీ తీర ప్రదేశం వంటిదే దక్షిణ సముద్రతీర ప్రాంతం. ఇన్ని సామ్యాలు ఉన్న కారణంగా వారణాశికి దక్షారామానికి తారతమ్యాన్ని చర్చించటం ధర్మం కాదు సుమా అని చెప్పాడు సప్తర్షులకు అగస్త్యమహర్షి.

★★★

# తీర్థసేవ

**2.** చం. **వ్రతములు లేనివారు నుపవాసపరాఙ్ముఖు లైనవారు దు**
**ర్మతులు విహీనశౌచులుఁ గ్రమంబునఁ దీర్థము లాడ నోప రా**
**తతగుణశాలి వీ వఖిలధర్మవిదుండవు గావునన్ శుభ**
**స్థితిఁ జని తీర్థసేవనము సేయుము నీకు నభీష్టసిద్ధిగన్**

*భారతము ఆర. 2–275*

**అన్వయం :** వ్రతములు – లేనివారు, ఉపవాస – పరాక్ ముఖులు + ఐనవారు, దుర్మతులు, విహీనశౌచులున్, క్రమంబునన్ – తీర్థములు + ఆడన్ + ఓపరు. ఈవు – ఆతత – గుణశాలివి. అఖిల – ధర్మవిదుండవు. కావునన్ – శుభస్థితిన్ – చని – నీకున్ – అభీష్టసిద్ధిగన్ – తీర్థసేవనము – చేయుము.

**వ్యాఖ్య :** ఏ వ్రతమూ లేనివాళ్ళు – వ్రతాలు చెయ్యనివాళ్ళు, ఉపవాసమంటేనే ఇష్టం ఏ మాత్రమూ లేని వారు (పరాఙ్ముఖులు), చెడ్డబుద్ధి కలవారు, శుచిశుభ్రతలు లేనివారు (విహీనశౌచులున్) – అంటే మడీతడీ పాటించనివారు తీర్థస్నానం చెయ్యడానికి ఇష్టపడరు.